సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం : 29 : ఏప్రిల్ : 2023



ఎన్గల్‌లో ఇంటింటా సర్వే

చందుర్తి(వేములవాడ): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై జిల్లా అధికారులు ఎన్గల్ గ్రామంలో శుక్రవారం సర్వే చేపట్టారు. కిషన్‌రావు, తిరుపతి, గొర్రె లక్ష్మణ్ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: మే డే సందర్భంగా సీఐటీయూ నిర్వహించే వేడుకలకు సంబంధించిన పోస్టర్లను యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ శుక్రవారం ఆవిష్కరించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పనుల్లో వేగం పెంచాలి



వెంకట్రావుపల్లిలో పనులు పరిశీలిస్తున్న డీఈవో

ఇల్లంతకుంట/బోయినపల్లి: ఇల్లంతకుంట, బోయినపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లోని పాఠశాలల్లో చేపట్టిన మన ఊరు–మన బడి పనులను శుక్రవారం డీఈవో రమేశ్‌కుమార్ పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, జూన్ 12వ తేదీ నాటికి పనులు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మన బడిలో అభివృద్ధి పనులు చేస్తుందన్నారు. సీఆ రీపీలు నర్సయ్య, మల్లేశం, సీసీఓ భాగ్యలక్ష్మి ఉన్నారు.

మొక్కలు నాటేందుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

గంభీరావుపేట(సిరిసిల్ల): హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు అనువైన స్థలం కోసం అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ శుక్రవారం మండలంలోని నర్మాల గ్రామంలోని ఇరిగేషన్ స్థలాన్ని పరిశీలించారు. మొక్కలు నాటడం, సంరక్షణ చర్యల గురించి అధికారులతో చర్చించారు. ఇరిగేషన్ డీఈ నర్సింగ్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో అరుణ, ఎంపీవో రాజశేఖర్ ఉన్నారు.

రెవెన్యూ గవర్నమెంట్ ప్లీడర్‌గా రాంప్రసాద్‌గౌడ్



వేములవాడ: వేములవాడ ప్రాంతానికి చెందిన తీగల రాంప్రసాద్‌గౌడ్‌కు హైకోర్టులో రెవెన్యూ విభాగం గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమిస్తూ శుక్రవారం హైకోర్టు ఉత్తర్వులు వెలువరించింది. దీంతో వేములవాడకు చెందిన న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు రాంప్రసాద్‌గౌడ్‌కు అభినందనలు తెలిపారు.

డిగ్రీ కాలేజీలో ఉద్యోగ మేళా

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, బ్యాంకులు నిరుద్యోగ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. విప్రో, టెక్ మహీంద్రా, కాఫీస్టోన్, హెట్రో, టాలెంట్ హబ్ వంటి మల్టీనేషనల్ కంపెనీలు మేళాలో పాల్గొన్నాయి.

పట్టుబడిన వాహనాలకు వేలం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సర్కిల్‌లో వివిధ నేరాలలో పట్టుబడ్డ వాహనాలకు శుక్రవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరీ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఎనిమిది బైక్‌లను బహిరంగ వేలంలో విక్రయించగా ప్రభుత్వానికి రూ.2,43,500 ఆదాయం సమకూరిందని సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.1,75,500 తెలిపారు. ఎస్సై శైలజ, రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి



సిరిసిల్లటౌన్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎకరానికి రూ.50వేలు చొప్పున పరిహారం అందించాలని కోరుతూ కలెక్టరేట్ ఏవో గంగయ్యకు వినతిపత్రం అందించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, రాష్ట్ర నాయకుడు ఎర్రం మహేశ్, తుల ఉమ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణస్వామి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం లక్ష్మి, ఉపాధ్యక్షుడు శీలం రాజు, కౌన్సిలర్ గూడూరు భాస్కర్, టౌన్ ప్రెసిడెంట్ నాగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంటివెలుగులో 4,455 మందికి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో కంటివెలుగులో శుక్రవారం 4,455 మందికి పరీక్షలు చేశారు. 606 మందికి రీడింగ్, మరో 662 మందికి పాయింట్ అద్దాలు ఇచ్చారు. 64వ రోజు పరీక్షలు నిర్వహించారు.

చేనేతచట్టం ఉల్లం‘ఘను’లు’!



- ఇది సిరిసిల్ల శివారులోని రాజీవ్‌నగర్‌లోని ఓ కార్ఖానా. ఇక్కడ రేయింబవళ్లు పవర్‌లూమ్స్ (మరమగ్గాల)పై కాటన్ టవల్స్, లుంగీలు, కర్చీఫ్స్, బెడ్‌షీట్స్ ఉత్పత్తి అవుతున్నాయి. కాటన్ వస్త్రాలను ఈ మరమగ్గాలపై ఉత్పత్తి చేయడాన్ని 1985లో కేంద్ర జౌళిశాఖ నిషేధించింది. 11 రకాల కాటన్‌వస్త్రాలను కేవలం చేనేత (చేతితో నేసే మగ్గం) మగ్గాలపైనే ఉత్పత్తి చేయాలని నిర్దేశిస్తూ 11 వస్త్రాలను రిజర్వు చేశారు. కానీ సిరిసిల్లలో ఇలా కరెంట్‌తో నడిచే సాంచాలపై ఉత్పత్తి చేస్తున్నారు. ఇది పూర్తిగా 1985 చేనేత చట్టం ఎస్.వో.2160(ఇ)ని ఉల్లంఘించినట్లే. సిరిసిల్లలో చాలా మంది ఇలా చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు.



- ఇది సిరిసిల్ల మార్కండేయవీధిలోని చేనేత సహకార సంఘంలోని చేనేత సాంచాలు. ఈ మగ్గాలపై కాటన్‌వస్త్రాన్ని ఇద్దరు వృద్ధులైన చేనేత కార్మికులు ఉత్పత్తి చేస్తున్నారు. ఒక్క కార్మికుడు రోజంతా సాంచాపై పనిచేస్తే ఐదు మీటర్ల బట్టను ఉత్పత్తి చేయడం కష్టమే. ఇలా పొద్దంతా పనిచేస్తే మీటరుకు రూ.26 ఇస్తారు. అంటే రోజంతా పనిచేస్తే ఒక్కో కార్మికుడికి రూ.130 కూలి వస్తుంది. ఈ డబ్బులతో ఆ చేనేత కార్మికులు బతుకుసాగిస్తారు. ఇలా శ్రమించే చేనేత కార్మికుల బతుకుదెరువును పవర్‌లూమ్స్ దెబ్బతీస్తాయని, కరెంట్ మోటార్లతో నడిచే పవర్‌లూమ్స్‌పై కాటన్ వస్త్రాన్ని ఉత్పత్తి చేయొద్దనే నిబంధనలు విధించారు.

నిబంధనలు పాటించాల్సిందే..



జౌళిశాఖ విధించిన నిబంధనలు ఎవరైనా పాటించాల్సిందే. పవర్‌లూమ్స్‌పై చేనేతకు రిజర్వు చేసిన కాటన్‌వస్త్రాన్ని ఉత్పత్తి చేయడం చట్ట విరుద్ధం. చేనేత కార్మికుల ఉపాధిని దెబ్బతీసినట్లు అవుతుంది. ఎవరైన కాటన్ వస్త్రాన్ని పవర్‌లూమ్స్‌పై ఉత్పత్తి చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం.

– మిట్టకోల సాగర్, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, సిరిసిల్ల

జిల్లాలో సాంచాల స్వరూపం	
పవర్‌లూమ్స్ :	27,321
కార్మికులు :	10వేలు
చేనేత మగ్గాలు :	169
చేనేత కార్మికులు :	235

- చట్టాన్ని ఉల్లంఘిస్తూ.. కాటన్ వస్త్రోత్పత్తి
- పవర్‌లూమ్స్‌పై టవల్స్, కర్చీఫ్స్, లుంగీల ఉత్పత్తి
- సిరిసిల్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు... పోలీస్ కేసులు
- కుదేలవుతున్న చేనేత రంగం



పవర్‌లూమ్స్‌పై తయారైన కాటన్ టవల్స్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలువురు వస్త్రోత్పత్తిదారులు చట్టాన్ని ఉల్లంఘిస్తూ పవర్‌లూమ్స్‌పై కాటన్ వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నారు. దీన్నే చేనేత వస్త్రంగా ప్రచారం చేసుకుని మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. చేనేత వస్త్రాలు అంటే అభిమానం ఉన్న వారు కాస్త ఎక్కువ డబ్బులైనా చెల్లించి కొనుగోలు చేస్తుంటారు. వాస్తవానికి పవర్‌లూమ్స్‌పైనే ఆ బట్ట ఉత్పత్తి కావడంతో వినియోగదారులను మోసం చేసినట్లు అవుతుంది. సిరిసిల్లలో గుట్టుగా కాటన్ వస్త్రాన్ని పవర్‌లూమ్స్‌పై ఉత్పత్తి చేస్తున్నారు. దీనికి ప్రభుత్వం అందించే 50 శాతం విద్యుత్ రాయితీని కూడా వస్త్రోత్పత్తిదారులు పొందడం నేరం.

సిరిసిల్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

సిరిసిల్లలో 1985 చేనేత చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని అందిన ఫిర్యాదుతో కేంద్ర చేనేత, జౌళిశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్(చెన్నై) అధికారులు బుధవారం సిరిసిల్లలో దాడులు చేశారు. పట్టణంలో నెహ్రూనగర్‌కు చెందిన అన్నల్‌దాస్ శ్రీనివాస్ చేనేత పరిశ్రమకు రిజర్వు చేసిన వస్త్రాలను పవర్‌లూమ్స్‌పై ఉత్పత్తి చేస్తున్నారని గుర్తించి అతనిపై పోలీసు కేసు నమోదు చేశారు. ఆయన ఉత్పత్తి చేస్తున్న బట్టను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. ఆ నివేదిక వస్తే శ్రీనివాస్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుంటారు. శ్రీనివాస్ ఒక్కరే కాదు.. సిరిసిల్ల పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లోనూ పలువురు వస్త్రోత్పత్తిదారులు ఇలాగే చట్టాన్ని ఉల్లంఘిస్తూ పవర్‌లూమ్స్‌పై కాటన్ వస్త్రాన్ని ఉత్పత్తి చేస్తున్నారు.

పవర్‌లూమ్స్‌పై ఉత్పత్తి చేయొద్దు

కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 11 రకాలైన కాటన్ వస్త్రాలను పవర్‌లూమ్స్‌పై ఉత్పత్తి చేయడానికి వీలులేదు. ఈ మేరకు 1985లో చట్టం చేశారు. ఇందులో సాంచాలపై కాటన్ చీరలు, ధోతి, టవల్, బూడిదరంగు అంగవస్త్రం, లుంగీలు, బెడ్‌షీట్స్, బెడ్ కవర్లు, జమక్కలమ్ దుర్రీ, కాటన్ డ్రెస్ మెటీరియల్, బ్యారక్ బ్లాంకెట్స్ లేదా కంబళి, శాలువా(లోయర్ మఫ్లర్), ఉన్నీ ట్వీడ్, కాటన్ చద్దర్‌లను ఉత్పత్తి చేయొద్దని రిజర్వు చేశారు. గతంలో 22 రకాల కాటన్ వస్త్రాలను రిజర్వు చేసినా.. వాటిని 11 రకాలకు కుదించారు. ఈమేరకు కేంద్ర జౌళిశాఖ తేదీ 26.07.1996లో ఎస్.వో 557(ఇ) రద్దు చేస్తూ ఎస్‌వో 2160ని విడుదల చేసింది. దీని ప్రకారం కాటన్ వస్త్రాలను ఉత్పత్తి చేయొద్దనే నిబంధనలు ఉన్నా జిల్లా వ్యాప్తంగా అనేక మంది వస్త్రోత్పత్తిదారులు ఉల్లంఘిస్తున్నారు.

జిల్లా కోర్టుకు వేసవి సెలవులు

సిరిసిల్లటౌన్: కోర్టులకు తెలంగాణ హైకోర్టు వేసవి సెలవులు ప్రకటించింది. ఈమేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించింది. వేసవి సెలవుల దృష్ట్యా జిల్లా జడ్జీల స్థానంలో ఇన్‌చార్జీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెండు దఫాలుగా వేసవి సెలవుల్లో ఇన్‌చార్జి న్యాయమూర్తులను నియమించింది. మే 1వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ప్రస్తుత రాజన్న సిరిసిల్ల జిల్లా న్యాయమూర్తి ప్రేమలత, మే 17 నుంచి 31వ తేదీ వరకు ల్యాండ్ రీఫోరమ్స్ అప్పిలియేటీవ్ ట్రిబ్యునల్ చైర్మన్, కరీంనగర్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి వాణిని నియమించారు.

వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజు



పెంట రాజు

వేములవాడ: వేములవాడ అడ్వకేట్స్ అసోసియేషన్ రీపోలింగ్ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. అధ్యక్షుడిగా పెంట రాజు, ప్రధాన కార్యదర్శిగా నక్క దివాకర్, ఉపాధ్యక్షుడిగా గడ్డం సత్యనారాయణరెడ్డి, సహాయ కార్యదర్శిగా జంగం అంజయ్య, కోశాధికారిగా బొజ్జ నరేశ్, స్పోర్ట్స్ కార్యదర్శిగా రాజ్‌కుమార్, లైబ్రరీ సెక్రటరీగా గుజ్జ మనోహర్, సీనియర్ ఈసీ మెంబర్లుగా నరాల శ్రీనివాస్, కాతుబండ నర్సింగారావు, బొడ్డు గంగరాజు, జూనియర్ ఈసీ మెంబర్లుగా బొడ్డు బాలరాజు, నాగరాజు, గంప రమేశ్, మహిళా ప్రతినిధిగా అన్నపూర్ణ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు రేగుల దేవేందర్, విద్యాసాగర్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, గుమ్మడి శ్రీనివాస్‌ల ప్రకటించారు.

రీపోలింగ్‌లో రాజుదే గెలుపు..

వేములవాడ అడ్వకేట్స్ అసోసియేషన్ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం మార్చి 31న జరిగాయి. పెంట రాజు, పిట్టల మనోహర్ పోటీపడగా.. ఒక్క ఓటుతోనే రాజు విజయం సాధించారు. ఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయంటూ పిట్టల మనోహర్ రాష్ట్ర బార్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన బార్ అసోసియేషన్ తిరిగి ఎన్నికలు నిర్వహించాలని పేర్కొంటూ నలుగురు అడ్‌హక్ కమిటీ సభ్యులుగా రేగుల దేవేందర్, విద్యాసాగర్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, గుమ్మడి శ్రీనివాస్‌ను నియమించింది. అడ్‌హక్ కమిటీ సభ్యులు శుక్రవారం రీపోలింగ్ నిర్వహించారు. దీంతో రాజు 11 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.



కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

సమ్మెబాటలో కార్యదర్శులు

సిరిసిల్లఅర్బన్/వేములవాడరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం నుంచి సమ్మెబాట పట్టారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి వచ్చిన కార్యదర్శులు కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ అధికారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. నాలుగేళ్లుగా ప్రొబేషనరీగానే విధులు నిర్వర్తిస్తున్నామని, నియామక సమయంలో నిబంధనల ప్రకారం పర్మినెంట్ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు.



వేములవాడలో నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

గల్ఫ్ గోసలు

- ‘రుద్రంగికి చెందిన వాసాల నరేశ్(30) మలేషియాలో పనిచేసేందుకు ఓ ఏజెంట్ దగ్గర రూ.1.50 లక్షలకు వీసా తీసుకున్నాడు. చెన్నై ఎయిర్‌పోర్టుకు వెళ్లగా వీసా నకిలీదిగా తేలింది. గల్ఫ్ దేశానికి వెళ్లడానికి పలుమార్లు వీసాలకు అప్పులు చేసి అవి తీర్చేందుకు దారి కనిపించక ఊరి సమీపంలో అటవీ ప్రాంతంలో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు.

- ‘కోనరావుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు పీజీ చదివాడు.కరోనాతో తన చేస్తున్న చిన్నపాటి వ్యాపారం దెబ్బతింది. దీంతో తెలిసిన వారి సహాయంతో సౌదీ దేశానికి వెళ్లేందుకు రిగ్గర్ పని కోసం దాదాపు రూ.4 లక్షలు వెచ్చించాడు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత ముందుగా అనుకున్న పనికి పరీక్ష రాయాలన్నారు. ఆ పరీక్ష కోసం ఏడాది పాటు వేచి చూసి ఇక లాభం లేదనుకుని స్వదేశానికి తిరిగొచ్చాడు.



- పని కోసం వెళ్లి పస్తులు
- మోసపోతున్న వలసకార్మికులు
- నకిలీ ఏజెంట్ల నియంత్రణకు నిఘా
- 87126 56411లో ఫిర్యాదు చేయాలి

సిరిసిల్లక్రైం: ఉన్న ఊరిలో ఉపాధి కరువై.. గల్ఫ్ బాట పడుతున్న యువత ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోతున్నారు. ఆర్థికంగా స్థిరపడాలన్న ఆలోచనతో వీసాల కోసం లక్షల రూపాయలు అప్పులు చేసి ఏజెంట్ల చేతులో పోస్తున్న జిల్లా వాసులలో చాలా మంది నిలువున మోసపోయారు. ఏజెంట్లు ఇక్కడ చెబుతున్న పనికి.. అక్కడికెళ్లాక చేస్తున్న పనికి సంబంధం ఉండడం లేదు. అంతేకాకుండా వేతనాల్లోనూ తేడాలు ఉంటున్నాయి. మోసపోయామని గుర్తించిన చాలా మంది స్వదేశానికి వచ్చేందుకు తంటాలు పడుతున్నారు. ఇటీవల మలేషియాలో 44 మంది చిక్కుకున్న విషయం ఆలస్యంగా తెలిసింది.

దశ మారుతుందన్న ఆశతో..

ఆర్థికంగా స్థిరపడవచ్చనే ఆశతో చాలా మంది గల్ఫ్ బాట పడుతున్నారు. అక్కడికి వెళ్తున్న వారిలో సగం మందికి కూడా ఇక్కడ చెప్పినట్లు వేతనాలు, పని ఉండడం లేదు. నెలకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వస్తుందన్న ఏజెంట్ మాటలు నమ్మి పోతున్న వారికి నిరాశ ఎదురవుతుంది. దాదాపు పదేళ్ల పనిచేసిన అనుభవం ఉన్న వారికే ప్రమోషన్లు ఇచ్చి కాస్త వేతనం పెంచుతున్నారని అక్కడికి వెళ్లి వచ్చిన ఒకరు చెప్పారు. ఎండ తక్కువగా ఉంటుందని మన వారిలో చాలా మంది స్టోర్‌కీపర్, ఆఫీస్ సబార్డినేట్, సూపర్‌మార్కెట్‌లలో పని చేస్తుంటారు.

జిల్లాలో ఏడు అధికారిక ఏజెన్సీలు

విదేశాలకు కార్మికులను సరఫరా చేసేందుకు మన జిల్లా నుంచి ఏడు ఏజెన్సీలకు మాత్రమే అధికారిక గుర్తింపు ఉంది. వీరి నుంచి గల్ఫ్, ఇతర దేశాలకు వెళ్తే మోసాలు జరిగే అవకాశాలు తక్కువగా ఉంటాయని పోలీస్ అధికారులు చెబుతున్నారు. ముందుగా చెప్పిన పని, వేతనాలు అందకుంటే న్యాయపరంగా పోరాడేందుకు అవకాశాలు ఉంటాయని తెలిపారు.

నిఘా కోసం సీఐ స్థాయి అధికారి

గల్ఫ్ పేరిట జరుగుతున్న మోసాలను నియంత్రించేందుకు అప్పటి జిల్లా ఎస్పీ విశ్వజిత్ కాంపాటి ఏకంగా డీఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో గల్ఫ్ సెల్ ఏర్పాటు చేశారు. వీసాలపై ఎలాంటి అనుమానాలు ఉన్న గల్ఫ్‌సెల్‌లో సంప్రదించి తెలుసుకునే అవకాశం ఉండేది. అయితే కొన్నాళ్లకే అది మరుగున పడింది. ఇటీవల విధుల్లో చేరిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ గల్ఫ్‌మోసాలకు చెక్ పెట్టేందుకు సీఐ కరుణాకర్‌కు ప్రత్యేకంగా విధులు కేటాయించారు. నకిలీ ఏజెంట్ల గురించి 87126 56411లో సంప్రదించాలని తెలిపారు. మార్చి నుంచి ఇప్పటి వరకు దాదాపు 15 మంది ఫిర్యాదు చేశారని సీఐ కరుణాకర్ తెలిపారు. చట్టపరిధిలో వీరికి న్యాయం చేసేందుకు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

జిల్లాలో నమోదైన కేసులు	
సంవత్సరం	కేసులు
2021	4
2022	10
2023	12 నేటి వరకు

కారోబార్లకు కష్టాలే..

- అత్తెసరు వేతనాలు.. కానరాని గుర్తింపు
- పీజీ చదివినా.. పారిశుధ్యం పని చేయాల్సిందే
- మే 5వ తేదీ నుంచి సమ్మెకు దిగుతున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కారోబార్.. అంటే గ్రామ పంచాయతీకి ఆల్‌రౌండర్. ఇంటి పన్నులు, రికార్డుల నిర్వహణ, సమాచారం, జనన–మరణాల నమోదు, పథకాల అమలు, లబ్ధిదారుల గుర్తింపు, తాగునీరు, పారిశుధ్యం, మురుగు నిర్వహణ, డ్రైవింగ్, మెకానిక్, వీధిదీపాలు.. ఒకటేమిటి.. పంచాయతీ పరిధిలో దాదాపు 30కిపైగా విధులు నిర్వహిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రతీ గ్రామ పంచాయతీకి వీరు ఆరో ప్రాణం. అంతటి ప్రాధాన్యమున్న కారోబార్, పంచాయతీ సిబ్బంది తమకు కనీస వేతనాలు, హక్కుల కోసం సమ్మెకు దిగుతున్నారు. ఇప్పటికే సమ్మె నోటీసులను ఆయా జిల్లాలో పంచాయతీ అధికారులకు అందజేశారు.

అసలేంటి విధానం?

గ్రామ పంచాయతీలో వివిధ పనుల నిర్వహణకు స్థానికులను గతంలో కారోబార్‌లుగా నియమించుకుంది. వీరిని పంచాయతీ తీర్మానం ద్వారా విద్యార్హతలు, నైపుణ్యం ఆధారంగా వీరిని చేర్చుకునేవారు. ఉదాహరణకు డిగ్రీ ఆపైన చదవిన వారికి బిల్ కలెక్టర్, రికార్డుల నిర్వహణ వంటి పనులు, డ్రైవింగ్, ఎలక్ట్రిషియన్, ప్లంబర్ పని తెలిసిన వారికి అవే ఉద్యోగాలు, మిగిలిన వారిని సఫాయి కార్మికులుగా నియమించుకునేవారు. వీరిలో రికార్డుల నిర్వహణ, బిల్లుల వసూలు, సమాచార సేకరణ వంటి రాతపనులు చూసేవారిని కారోబార్‌లుగా, మిగిలిన వారిని సిబ్బందిగా పిలిచేవారు.

- ఇదే క్రమంలో 2019లో ప్రభుత్వం జూనియర్ పంచాయతీ సెక్రటరీ (జేపీఎస్)లను నియమించుకుంది. అదే సమయంలో ప్రభుత్వం జీవో నెం.51 విడుదల చేసింది. దీని ప్రకారం.. గ్రామ పంచాయతీలో పనిచేసే సిబ్బందిని మల్టీపర్పస్ వర్కర్(ఎంపీడబ్ల్యూ)గా నామకరణం చేసింది. ఏ పనిచెబితే ఆ పని చేయాల్సి ఉంటుంది.
- ప్రతీ గ్రామానికి ఐదుగురు చొప్పున వీరిని నియమించారు. ఒకప్పుడు రూ.2,000 నుంచి రూ.3,000లకు పనిచేసిన వీరికి జీవో నెం.51 కారణంగా రూ.8,500 చొప్పున వేతనం ఇచ్చేవారు. ప్రతీ 500 మందికి ఒక కారోబార్ ఉండాలన్న నిబంధన తీవ్ర ప్రతికూలంగా మారింది.



మానకొండూర్: సమ్మెనోటీసు ఇస్తున్న కార్మికులు

వెయ్యి జనాభా ఉన్న గ్రామంలో ఐదుగురు కారోబార్‌లు ఉంటే అందులో కేవలం ఇద్దరికే రూ.8,500 చొప్పున ఇస్తారు. దాన్నే అంతా పంచుకోవాల్సిన దుస్థితి. డ్రైవర్లు, ఎలక్ట్రిషియన్ ప్రమాదవశాత్తు మరణించినా.. వారి కుటుంబాలకు పరిహారం దక్కడం లేదు.

- ప్రస్తుతం దాదాపుగా అన్ని గ్రామాల్లో కారోబార్‌లు జేపీఎస్‌లకు సహాయకులుగా వ్యవహరిస్తున్నారు. అలా కుదరని పక్షంలో జీవో 51 ప్రకారం.. డిగ్రీ, పీజీలు చదివినా సరే డ్రైవింగ్, ప్లంబింగ్, చివరికి సఫాయి కార్మికునిగా కూడా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. 30 ఏళ్లుగా సేవలందిస్తున్న తమకు ఎప్పటికైనా మంచి భవిష్యత్తు దక్కుతుందన్న ఆశతో విధులు నిర్వహిస్తున్నారు.

జిల్లా	గ్రామ పంచాయతీలు	సిబ్బంది	కారోబార్‌లు
కరీంనగర్	330	1,252	245
జగిత్యాల	414	1,651	326
పెద్దపల్లి	315	1,254	214
రాజన్నసిరిసిల్ల	262	1,035	223

వీరి డిమాండ్లు ఏంటి?

- గతంలో కారోబార్లుగా వ్యవహరించిన అందరినీ జేపీఎస్‌లకు సహాయకులుగా అధికారికంగా నియమించాలి. వీరికి గ్రామ పంచాయతీ కార్యదర్శి హోదా కల్పిస్తూ.. రూ.21,500 వేతనం అందించాలి.
- 500 ఒక కారోబార్ కాకుండా.. గ్రామపంచాయతీలో ఇప్పటికే పనిచేస్తున్న కారోబార్లందరికీ రూ.15,500 చొప్పున వేతనాలు ఇవ్వాలి.
- కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి.
- జీవో నెం.51కు కారోబార్లు సిబ్బంది సమస్యలకు అనుగుణంగా సవరణలు చేయాలి.
- కారోబార్, సిబ్బందికి పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్ సదుపాయం కల్పించాలి.
- సిబ్బందిలో ఎవరు ప్రమాదవశాత్తు మరణించినా వారికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలి.

వెంటనే ప్రభుత్వం స్పందించాలి



ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 51 కారణంగా కారోబార్లు, సిబ్బంది అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మల్టీపర్పస్ వర్కర్ పేరిట అందరినీ దాదాపుగా సఫాయి కార్మికులుగా చూస్తున్నారు. విధినిర్వహణలో మా ప్రాణాలు పోయినా.. పరిహారం కూడా అందడం లేదు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలి.

– బింగి గణేశ్, తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్ సిబ్బంది యూనియన్

క్లుప్తంగా

జెండా గద్దె కూల్చడం సరికాదు



కూల్చిన జెండా గద్దెను చూపుతున్న రాములు

వేములవాడ : మే డే కార్మిక దినోత్సవాన్ని జరుపుకునేందుకు మున్సిపల్ కార్యాలయం ముందు ఓ గద్దె నిర్మించుకుంటామని మున్సిపల్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకున్నామని, అనుమతి పత్రం ఇవ్వకపోవడంతో చిన్న గద్దె కట్టిన తర్వాత మున్సిపల్ అధికారులు దాన్ని కూల్చేయడం సరికాదని సీపీఐ జిల్లా నాయకుడు కదారి రాములు ఆరోపించారు. మున్సిపల్ పరిధిలో లే–అవుట్ స్థలాలు, అనుమతులు లేకుండా కొనసాగుతున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోకుండా కార్మికులు ఉత్సవాలు జరుపుకునే గద్దె నిర్మించుకుంటే మున్సిపల్ అధికారులకు ఆక్రమణలుగా కనిపిస్తున్నాయంటూ రాములు మండిపడ్డారు. తమ గద్దె నిర్మాణాన్ని అడ్డుకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు.

జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



నూతన కార్యవర్గంతో రాష్ట్ర అధ్యక్షుడు సాయిలు, తదితరులు

వేములవాడ: జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడు సాయిలు, ఎన్నికల అధికారి బాబు శ్రీనివాస్, అబ్జర్వర్ రాజు సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా గోగికార్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా టి. వెంకటేశ్వర్‌రావు, సీహెచ్ సంజీవరావు, యెల్ల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రాపెల్లి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా షాహిద్ పాషా, షబ్బీర్ అలీ, అహ్మద్ ఖాన్, కోశాధికారిగా ఖాజా మొయినొద్దీన్, కార్యవర్గ సభ్యులుగా రియాజ్, అనిల్, ప్రశాంత్, దేవయ్య, వేణు, బాబూన్, సాగారం శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరు 2027 వరకు కొనసాగుతారన్నారు. నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడ్డ మల్లయ్య

ముస్తాబాద్(సిరిసిల్ల): అప్పుల బాధతో రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో శుక్రవారం ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన దుబ్బెడ మల్లయ్య(58) తన పొలం వద్ద గురువారం రాత్రి చెట్టుకు ఉరివేసుకున్నాడు. మల్లయ్యకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి పెళ్లిళ్లకు రూ.15 లక్షల వరకు అప్పు అయ్యింది. అంతేకాకుండా ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి తనకున్న ఎకరం భూమిలో సాగు చేసిన వరిపంట నేలరాలింది. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం కనిపించక, పంటనష్టం జరగడంతో మనోవేదనకు గురైన మల్లయ్య గురువారం రాత్రి పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరివేసుకున్నాడు. పొలం పనులకు వెళ్లిన మల్లయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. మృతుని భార్య రాజవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ఊపందుకోని ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 256 కేంద్రాలకు గాను 148 కేంద్రాలే ప్రారంభం
- కొనుగోళ్లకు అడ్డంకిగా మారిన వర్షం
- కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడుతున్న రైతులు

యాసంగి వరి ధాన్యం వివరాలు
వరి సాగు : 1.70 లక్షల ఎకరాలు
దిగుబడి అంచనా : నాలుగున్నర లక్షల టన్నులు
ధాన్యం కొనుగోళ్ల అంచనా : 3.40 లక్షల టన్నులు
జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు : 256
ప్రారంభించిన కేంద్రాలు :148
కొనుగోలు చేసిన ధాన్యం : సుమారు 300 టన్నులు



తడగొండలో చేపడుతున్న ధాన్యం కొనుగోళ్లు

బోయినపల్లి (చొప్పదండి) : యాసంగిలో ధాన్యం కొనుగోళ్లు జిల్లాలో ఇంకా ఊపందుకోవడం లేదు. ఈ సీజన్‌లో జిల్లాలో 256 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. కానీ ఇప్పటికీ కేవలం 148 కొనుగోలు కేంద్రాలు మాత్రమే ప్రారంభించారు. ఇందులో సుమారు నాలుగైదు కేంద్రాల్లో మాత్రమే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. ఇప్పటివరకు కేవలం 3 వందల టన్నుల మేర మాత్రమే ధాన్యం కొనుగోళ్లు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అకాలవర్షాలు ధాన్యం కొనుగోళ్లకు ఆటంకంగా మారడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

256 కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో యాసంగి సీజన్‌లో 1.70 లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారు. సుమారు నాలుగున్నర లక్షల టన్నుల మేర వరి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేయగా 3.40 లక్షల టన్నుల మేర జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు చేయాలని అధికారులు భావించారు. ఈ క్రమంలో జిల్లాలో 256 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఈనెల 24న జిల్లా రైస్‌మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో పేర్కొన్నారు. ఇందులో పీఏసీఎస్–194, ఐకేపీ–46, డీసీఎమ్మెస్–12, మెప్మా–4 అని తెలిపారు. కాగా ఇప్పటివరకు గ్రామాల్లో కేవలం 148 కొనుగోలు కేంద్రాలు మాత్రమే ప్రారంభించారు. అందులో కేవలం 300 టన్నుల మేర మాత్రమే ధాన్యం కొనుగోళ్లు చేశారు.

వర్షం అడ్డంకి..

ధాన్యం కొనుగోళ్లకు వర్షం అడ్డంకిగా మారింది. ఇరవై రోజుల నుంచే జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. పలువురు రైతులు ధాన్యం తీసుకువచ్చి కొనుగోలు కేంద్రాల్లో పోశారు. ఈ మేరకు కల్లాల్లో ధాన్యం పెద్దఎత్తున పేరుకుపోయింది. ధాన్యం ఎండిన సమయంలో జిల్లాలో కొనుగోళ్లను ప్రారంభించలేదు. కాగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటి నుంచి నిత్యం అకాలవర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు కల్లాల్లోనే ధాన్యం నిల్వలను కాపాడుకునేందుకు అరిగోస పడుతున్నారు.

కేంద్రాల్లో వసతుల లేమి..

కొనుగోలు కేంద్రాల్లో వసతులు సరిగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అనేక సెంటర్లలో టార్పాలిన్ కవర్లు సరఫరా చేయకపోవడంతో రైతులు ధాన్యం తడవకుండా ఉండేందుకు కష్టాలు పడుతున్నారు. ధాన్యంపై కవర్లు కప్పినా ఈదురుగాలులకు కొట్టుకుపోయి ధాన్యం తడుస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో సరైన స్థలం లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. పలుచోట్ల కేంద్రాల వద్ద చిన్న వర్షం కురిసినా నీరు నిలుస్తుండడంతో కష్టమవుతోందని రైతులు తెలుపుతున్నారు.

పదిహేను రోజులవుతుంది



గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో పదిహేను రోజుల కిందట సుమారు 40 క్వింటాళ్ల మేర వరి ధాన్యం పోశాను. గురువారం కొనుగోళ్లు ప్రారంభం చేశారు. నా వడ్లు ఇంకా కొనలేదు. రోజూ వర్షం భయంతో రాత్రి పూట కవర్లు కప్పుతున్నా. ఉదయం తీస్తున్నాను. రోజూ ఇదే పని అవుతుంది.

– కట్ట బాబు, తడగొండ

కొనుగోళ్లు చేపడుతున్నాం



జిల్లాలో ఈ సీజన్‌లో 256 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు 3.44 లక్షల టన్నుల మేర ధాన్యం సేకరించాలని జిల్లా ఉన్నతాధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు జిల్లాలో 148 కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు 300 టన్నుల మేర ధాన్యం కొనుగోళ్లు చేశాం. ధాన్యం కొనుగోళ్లకు వర్షం ఇబ్బందిగా మారుతోంది.

–ఎస్. జితేందర్ రెడ్డి, డీఎస్‌వో, సిరిసిల్ల

అనుమతి లేకుండా పోలీసు అధికారుల ఫొటోలు పెట్టొద్దు



తెలంగాణ చౌక్‌లో ఫ్లెక్సీని తొలగిస్తున్న పోలీసులు

వేములవాడ: పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఫొటోలను ఫ్లెక్సీల్లో పెడితే చర్యలు తీసుకుంటామని, ఎవరైనా ఫ్లెక్సీల్లో ఫొటోలు పెడితే తక్షణమే తొలగించాలని డీఎస్పీ నాగేంద్రచారి శుక్రవారం పేర్కొన్నారు. ఓ ప్రైవేట్ కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్సీలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఫొటో పెట్టారని, తక్షణమే తొలగించాలని ఆదేశించారు. దీంతో పోలీసులు ఎస్పీ ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు. ఫ్లెక్సీల తొలగింపు వేములవాడలో చర్చనీయాంశమైంది.

బేసిక్ పే చెల్లించాలి



మాట్లాడుతున్న పాకాల శంకర్‌గౌడ్

సిరిసిల్లఅర్బన్: తెలంగాణలోని కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు బేసిక్ పే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్ గౌడ్ కోరారు. సిరిసిల్లలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేజీబీవీల్లో స్పెషల్ ఆఫీసర్ నుంచి వర్కర్ వరకు మహిళా ఉద్యోగులే ఉన్నారని, అయితే వారికి సరైన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

అనుమతి లేకుండా గుట్టలు పేల్చుతున్నారు

- భయంలో ప్రజలు..పట్టించుకోని అధికారులు
- కేటీఆర్ అనుచరుల అక్రమాలు నిగ్గుతేల్చుతాం
- టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి ఉమేశ్‌రావు



మాట్లాడుతున్న చీటి ఉమేశ్‌రావు

సిరిసిల్లటౌన్: జిల్లాకేంద్రం దగ్గరలో ఉన్న స్టోన్ క్రషర్స్‌లో అనుమతుల్లేకుండా గుట్టలను బాంబులతో పేల్చుతుంటే పోలీసులు, అధికారులు చోద్యం చూస్తున్నారని టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. మైనింగ్‌శాఖకు ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా అధికార పార్టీకి చెందిన వారు జిల్లా అధికారుల అండదండలతో అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఇందుకు మంత్రి కేటీఆర్ పేషి నుంచి ముఖ్య అధికారులు కూడా వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఇసుక, ల్యాండ్, మైనింగ్ అక్రమాలకు పాల్పడుతున్న అక్రమార్కులను నిగ్గు తేల్చేదాకా కాంగ్రెస్ పార్టీ పక్షాన పోరాడుతామని హెచ్చరించారు. ఇక జిల్లాలోని వడగండ్లతో రైతులకు పంట నష్టం ఏర్పడితే కనీసం పరామర్శించిన వారు లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టోన్ క్రషర్స్‌లో అక్రమాలపై కలెక్టర్, ఎస్పీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, నాయకులు వెంగళ అశోక్, చోటు, ఎడ్మల భూపాల్ పాల్గొన్నారు.

రాజయ్య సేవలు చిరస్మరణీయం

- ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమానికి బీజం వేసిన వ్యక్తి
- ఘనంగా రెండో వర్ధంతి
- నివాళి అర్పించిన నాయకులు





ధర్మారంలో నివాళి అర్పిస్తున్న రాష్ట్ర నాయకులు, ఎల్లారెడ్డిపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు, అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/కోనరావుపేట(వేములవాడ): ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి బడులకు జీవంపోసిన గొప్ప వ్యక్తి దివంగత ఎంఈఓ మంకు రాజయ్య అని ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు కొనియాడారు. ఎల్లారెడ్డిపేట ఎమ్మార్సీలో శుక్రవారం రాజయ్య రెండో వర్ధంతి సందర్భంగా సంతాపసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు రాజయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీటీసీలు అనసూయ, నాగరాణి, పట్టణ అధ్యక్షుడు బందారి బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'రాజయ్య సేవలు మరువలేనివి'

విద్యాసంస్కర్త మంకు రాజయ్య సేవలు మరువలేనివని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు కొనియాడారు. ధర్మారంలో శుక్రవారం మంకు రాజయ్య రెండో వర్ధంతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంకు రాజయ్య స్ఫూర్తితోనే తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇంగ్లిష్ మీడియాన్ని అమలు చేసిందన్నారు. టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లకావత్ శర్మన్‌నాయక్, టీఎస్‌టీపీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపెల్లి ప్రశాంత్‌కుమార్, పీఆర్టీయూ నాయకులు మధుసూదన్, శ్రీనివాస్, గంగారాం పాల్గొన్నారు.

తరలిపోతున్న కలప

- అటవీ ప్రాంతం నుంచి టేకు కలప స్వాధీనం
- వివరాలు వెల్లడించేందుకు అటవీ శాఖ సిబ్బంది నో
- కూలీల సెల్‌ఫోన్లు స్వాధీనం
- పట్టుకున్న విషయం తెలియదని ఎఫ్‌ఆర్వో సమాధానం



స్వాధీనం చేసుకొని ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప ఇదే..

చందుర్తి (వేములవాడ): చందుర్తి అటవీ ప్రాంతంలో నరికివేసిన టేకు కలపను అటవీ శాఖ సెక్షన్ అధికారిని విజయ శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రానికి చెందిన శంకర్ అనే వ్యక్తి కూలీలతో విలువైన టేకు కలపను నరికి వేస్తుండగా అటవీ శాఖ సిబ్బందికి అందిన పక్కా సమాచారంతో దాడిచేశారు. ఈ దాడుల్లో అక్రమంగా నరికిన కలపతో పాటు కూలీల సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అటవీ శాఖ అధికారుల రాకను పసిగట్టి కూలీలు పారిపోగా, అక్కడే వారు వదిలి వెళ్లిన సెల్‌ఫోన్లు లభ్యమైనట్లు తెలిపారు. సెల్‌ఫోన్ల వివరాలను పోలీసు శాఖ సహకారంతో వారి పూర్తి వివరాలు వెల్లడిస్తామని సెక్షన్ అధికారి వివరించారు. అటవీ ప్రాంతంలో లభ్యమైన టేకు కలపను ట్రాక్టర్‌లో మల్యాల గ్రామానికి తరలించారు. అటవీ శాఖలో పనిచేస్తున్న వాచర్ ఆధీనంలో వాటిని భద్రపర్చినట్లు సమాచారం.

కలప అక్రమ రవాణాదారులతో కుమ్మక్కు?

చందుర్తి అటవీ ప్రాంతంలోని విలువైన టేకు కలపపై స్మగ్లర్ల కన్నుపడింది. కొద్ది రోజులుగా కలప అక్రమ రవాణాదారులు కూలీలకు డబ్బులు చెల్లిస్తూ కలపను యథేచ్ఛగా నరికేస్తున్నారు. అటవీ శాఖ సిబ్బంది బుధవారం ట్రాక్టర్‌తో సహా టేకు కలపను పట్టుకున్నారు. ఈ సంఘటన మరవకముందే, 48 గంటలల్లోపే మళ్లీ టేకు కలపను నరికి వేస్తుండగా అటవీ శాఖ సెక్షన్ అధికారి దాడి చేశారు. దాడుల్లో కూలీలు పరారైనా వారి సమాచారం సేకరించేందుకు సెల్‌ఫోన్లు లభ్యమయ్యాయి. దీంతోవారిని రక్షించేందుకు కొందరు పైరవీలు చేయడంతో ఉదయం పట్టుకున్న కలప వివరాలను అటవీ శాఖ ఉన్నతాధికారులకు తెలుపకుండా సిబ్బంది గోప్యంగా ఉంచినట్లు ప్రచారం జరుగుతోంది. పట్టుకున్న కలప విలువను చెప్పేందుకు అటవీశాఖ సెక్షన అధికారి దాటవేశారు. దీంతో అసలు ఏం జరుగుతుందోనని ఆరాతీయగా, జరిమానా విధిస్తే మొత్తంలో సగం జరిమానా ఇస్తే, మరో సగం డబ్బులు సిబ్బందికి ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు సమాచారం. కలప అక్రమ రవాణాదారులకు జరిమానా విధించి చర్యలు తీసుకుంటేనే అడవులు అంతరించకుండా కాపాడుకోవచ్చని ప్రజలు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

సమాచారం తెలుపని ఎఫ్ఆర్వో..

చందుర్తి అటవీ ప్రాంతంలో టేకు కలపను అటవీ శాఖ సెక్షన్ అధికారి పట్టుకోగా వివరాల కోసం వేములవాడ ఎఫ్ఆర్వో ఖలీలొద్దీన్‌కు ఫోన్ చేయగా బుధవారం పట్టుకున్న వివరాలను వెల్లడించారు. ఆ సమాచారం కాదని, శుక్రవారం మళ్లీ పట్టుకున్నారని, తెలుసుకొని చెప్పుతానని బదులిచ్చారు. మరి కొద్దిసేపటికి ఫోన్ చేసి పట్టుకున్న మాట వాస్తవమేనని ఆయన బదులిచ్చారు. సాయంత్రం వరకు ఉన్నతాధికారి తెలుపకపోవడంతో వెనుక మతులబుమేమిటోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చెత్త వాహనాలకు సుస్తీ

- మరమ్మతు పేరుతో 8 ఆటోలు మూలకు
- వీధుల్లో పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- వర్షాలతో పరిసరాలు దుర్గంధం



సినారె కళామందిరంలో మూలుగుతున్న చెత్త సేకరణ వాహనాలు

వేములవాడ: వేములవాడ మున్సిపల్ పరిధిలోని 28 వార్డులలో చెత్త సేకరణకు ఉపయోగించే వాహనాలకు సుస్తీ చేసింది. పదిహేను రోజులుగా మరమ్మతు పేరుతో 8 ఆటోలు స్థానిక సినారె కళామందిరంలోనే మూలుగుతున్నాయి. ఫలితంగా పట్టణంలో చెత్తసేకరణ ఇబ్బందిగా మారింది. కాలనీల్లో చెత్తకుప్పలు పేరుకుపోవడం.. వరుసగా వర్షం పడుతుండడంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. చెత్త కుప్పలను పందులు, కుక్కలు చిందరవందరగా చేస్తుండడంతో రోడ్డుపైకి చెత్త కొట్టుకొస్తుంది.

మూలకుపడ్డ వాహనాలు

వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణ వాహనాలను మరమ్మతు పేరుతో పక్కకు పడేశారు. తక్కువ వాహనాలు చెత్త సేకరణకు తిరుగుతుండడంతో చాలా కాలనీల్లోకి చెత్త వాహనాలు రావడం లేదు. చిన్నపాటి రిపేర్లు రావడం, పలువురు ఆటో డ్రైవర్లు సైతం సెలవుల్లో ఉండడం సమస్యగా మారింది. /

మున్సిపాలిటీలో వాహనాలు ఇవీ..	
ఆటోలు :	25
మూలకుపడ్డ ఆటోలు :	08
ట్రాక్టర్లు :	7
దోజర్ :	1
వైకుంఠరథం :	1
స్వీపింగ్ మిషన్ :	1
షీ టాయిలెట్ బస్సు :	1

విడిభాగాలు లేకపోవడంతోనే..



చిన్నపాటి మరమ్మతులతోపాటు వాహనాలకు సంబంధించిన విడిభాగాలు స్థానికలంగా లభించడం లేదు. త్వరలోనే వరంగల్ నుంచి పార్ట్స్ తెప్పించి పక్కనబెట్టిన వాహనాలను అందుబాటులోకి తెస్తాం. పలువురు డ్రైవర్లు సెలవులో ఉండడంతోనూ పూర్తిస్థాయిలో వాహనాలు తిప్పలేకపోతున్నాం. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చెత్తను సేకరిస్తాం. – కిరణ్, హెల్త్ అసిస్టెంట్, వేములవాడ మున్సిపల్

వ్యాయామ గురువు ఇకలేరు



రాజయ్య (ఫైల్)

వేములవాడ రూరల్ : వేములవాడలోనే వ్యాయామ గురువుగా ఎందరో యువకులకు వ్యాయామం నేర్పిన నునుగొప్పుల రాజయ్య ఇకలేరు. ఆయన మరణవార్త తెలుసుకున్న కులస్తులు, అభిమానులు, ఉపాధ్యాయులు శుక్రవారం తరలివచ్చారు. వేములవాడకు చెందిన నునుగొప్పుల రాజయ్య 1942 నవంబర్‌లో జన్మించాడు. ఆయనకు భార్య భాగ్యలక్ష్మి, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. దాదాపు 40 ఏళ్లు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగాడు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటు తర్వాత 13 మండలాలకు యాదవ సంఘం అధ్యక్షుడిగా సేవలందించారు. వేములవాడ, బోయినపల్లి, చందుర్తి మూడు మండలాల రిటైర్మెంట్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడిగా ప్రస్తుతం కొన్నేళ్లుగా కొనసాగుతున్నారు. ఆయన నవ మండలాల యాదవ మహాసభను పట్టణంలో భారీఎత్తున ఏర్పాటు చేసి గొల్ల కురుమ యాదవులకు సొసైటీల ఏర్పాటు చేశారు. ఆయన మరణవార్త తెలుసుకున్న జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మిర్యాల భాస్కర్‌యాదవ్, యూత్ అధ్యక్షుడు కాశవేని మహేశ్ యాదవ్, ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎంపీపీ బండ మల్లేశం యాదవ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, తోటి స్నేహితులు సిద్ధంశెట్టి రాజేశం, చల్ల సత్తయ్య, పాత విశ్వేశం, వాసం మల్లేశం, జిల్లా యాదవ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, కులస్తులు, పట్టణ ప్రముఖులు తరలివచ్చారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి



కొనుగోలు కేంద్రంలో వడ్లను పరిశీలిస్తున్న ఖీమ్యానాయక్

ముస్తాబాద్(సిరిసిల్ల): ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని నామాపూర్, పోత్గల్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఖీమ్యానాయక్ మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటామని, రైతులు అధైర్య పడవద్దు అని భరోసానిచ్చారు. అనంతరం మండలంలోని పలు రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. ఏపీడీ పాపారావు, ఉన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వడగండ్ల వానలతో పంట నష్టపోయిన రైతులకు వెంటనే ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య కోరారు. ఎల్లారెడ్డిపేట పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వానలతో పంటలు పూర్తిస్థాయిలో తుడిచిపెట్టుకుపోయాయన్నారు. ప్రతి ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని కోరారు. లింగంగౌడ్,గంట బుచ్చాగౌడ్, రాంరెడ్డి, బానోతు రాజు పాల్గొన్నారు.